7CTR1:7CTR1.qxd 8/6/2026 11:22 PM Page 1



తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఘనంగా ఆడికృతిక ఉత్సవాలు



రామకుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త

మండల పరిధిలోని పాల రేవగడ్డలో వెలసిన శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్య స్వామి (బాలమురుగన్) ఆలయంలో ఆడికృతిక ఉత్స వాలను నేత్రపర్వంగా జరిపారు. గురువారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయమంతా విద్యుత్ దీపాలంకరణతో సుందరికరించారు. ఆంధ్ర ,కర్ణాటక, తమిళనాడు రాష్ట్ర కూడలి కావడంతో భక్తాదులు జనసంద్రంగా మారింది. వీపు తేరు, నెమలి పేరు, పచ్చకావుళ్ళు, శరీరమంతా నిమ్మకాయలు గుచ్చుకొని తేరు లాగుకుంటూ ఆలయానికి చేరుకుని భక్తులు మొక్కలు తీర్చుకుంటున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తాదులకు ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదాన ప్రసాదాలు పంపిణీ చేశారు.

## డ్రోన్ ద్వారా మందుల పిచికారీ రైతులకు లబ్ధి

### - ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు



కుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త

రైతులు తక్కువ ఖర్చుతోనే పంటలకు డ్రోన్ ద్వారా మందుల పిచికారీ చేస్తే లాభ దాయకంగా ఉంటుందని ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. గురువారం మం డలంలోని వసనాడు గ్రామంలో నీతి ఆయోగ్ సంస్థ ద్వారా రైతులకు డ్రోన్ విని యోగంపై, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఒక ఎకరం పంటకు స్ప్రే చేయాలంటే ఒక లీటరు మందుకు వంద లీటర్ల నీటితో పాటు గంట సమయం పడుతుందన్నారు. అదే డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేయాలంటే 125మి.లీ.ల మందుకు 12 లీటర్ల నీరు ఉంటే పది నిమిషాల్లోనే పిచికారీ చేయవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ శరవణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, ఎడి పల్లవి, నేతలు నాగరాజు, వల్లెప్ప,అధికారి నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

### హరోంహరలతో మారుమ్రోగిన

# కార్వేటినగరం







స్వామివార్లకు సారె తీసుకెళ్ళుతున్న పద్మసరస్సు గిరిజనులు, తెప్పోత్సవం అలంకరించిన దృశ్యం.

కార్వేటినగరం, ఆగస్టు 6 ప్రభాతవార్త:

కార్వేటినగరం స్కంధపుష్కరిణికి సమీపంలో కొమరగిరి కొండపై వెలసిన శ్రీవళ్ళీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి వారికి వైభవంగా దప్పులతో,నృత్యాలతో టపాకాయలు కాలుస్తూ పద్మసరస్సు గిరిజ నులు సారె తీసుకెళ్ళారు.పద్మసరస్సు నుంచి సుబ్రమణ్యస్వామి ఆలయానికి కాలినడకతో గ్రామస్థులు పెద్ద ఎత్తున ఊరేగారు.చుట్టుప్రక్కల మండలాల భక్తులు కావడి చెల్లింపుకు హరోంహర నామాలు పలుకుతూ అధికసంఖ్యలో ఆలయంకు చేరుకున్నారు.తెల్లవారుజామున 4నుండి 6 గంటల వరకు స్వా మివార్లకు పలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్కంధపుష్కరిణి చుట్టూ ఆలయప్రాంగణం, తెప్పోత్స వం,రహదారులు,విద్యుద్దీపాలతో ఆకర్షనీయంగా అలంకరించారు. కార్వేటినగరం సి.ఐ హనుమంతప్ప, యస్,ఆర్,పురం,వెదురుకుప్పం,కార్వేటినగరం యస్.ఐలు,పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించి ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. స్కంద పుష్కరిణిలో తెప్పోత్స వాన్ని భక్తులకు కనులకు విందుగా చేశారు.స్వామివార్లను అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.భక్తులు కర్పూర హార తులు పట్టి మ్రొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున ముత్తుమునస్వామిరెడ్డి, దేవేంద్రరెడ్డిలు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వా హణాధికారి కృష్ణానాయక్,ఆలయచైర్మన్ రామిశెట్టి రాజశేఖర్,అర్చకులు,భక్తులు పాల్గొన్నారు.

# కావళ్ళతో కళ కళ

## విజ్ఞానగిరికి కదలి వచ్చిన భక్తజనం



కావళ్ళతో మొక్కులు తీర్చుకొనుటకు తరలి వచ్చిన భక్తులు

శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తిలోని విజ్ఞానగిరి గురువారం కావళ్ళతో కళకళలాడింది. మురుగన్ బ్రహ్మోత్స వాల్లో ఆడికృత్తిక సందర్భంగా గురువారం సాయంత్రం అయిదు గంటలకు అందిన సమాచారం మేరకు 40వేలకు పైగా భక్తులు దర్శనం చేసుకున్నట్లు సమాచారం. మధ్యాహ్నం నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం తరలి వస్తున్నారు. ఈ ఉత్స వాల్ని శ్రీకాళహస్తీశ్వరాలయంలో చెంగల్వరాయ స్వామి బ్రహ్మోత్స వాలు గాను, అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో మహోత్స వాలుగా నిర్వహిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 3గంటల నుంచి ఆలయంలో భక్తుల రద్దీ చోటు చేసుకుంది. స్థానిక భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి మురుగన్ దర్శనం చేసుకున్నారు. ఎటు చూసినా కావళ్ళతో 'హరోంహర' అంటూ మొక్కులు తీర్చుకున్నారు. తమిళనాడు సరిహద్దుల్లో గల శ్రీకాళహస్తిలో తమిళ సంప్రదాయాలు, సంస్కృతికి ఎంతో ప్రాధాన్యత ఉంది. తమిళ పండుగల్ని ఇక్కడ స్థిర పడిన వారు ఘనంగా జరుపుకుంటారు. ఆడికృత్తిక సందర్భంగా ఉదయం నుంచి భక్తులు పరిమితంగా ఉండగా మధ్యాహ్నం నుంచిఆ చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు. పెండ్లిమండపం నుంచి ఆర్‌టిసి బస్టాండు వరకు ఇసుకేస్తే రాలనంత రద్దీచోటు చేసుకుంది.అధికారికంగా అందించిన సమాచారం మేరకు సాయంత్రం 6గంటలకు అందిన సమాచారం మేరకు తలనీలాలు పదివేల మంది. సుమారు 5వేల మంది అర్చనలు, సుమారు 2వేల కావళ్ళను అధికారికంగా జరుపుకున్నారు.

ఆలయ ఇఓ బికె వెంకటేశులు ఈ ఉత్స వాలకు కొత్త అయినా మొదటి ఉత్స వం కాబట్టి ఉత్స వాల్లో ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయంలోని అందరు సిబ్బందిని కు మారస్వామి కొండపై పర్యవేక్షణకు నియమించారు. వారికి విధి విధానాలు సూచనలు చేసారు.భక్తుల తాకిడి పెరుగుతుండటంతో చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్,ఇఓ బికె వెంకటేశులు, డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్స్ పెక్టర్ కృష్ణారెడ్డి, ఎఇఓ హేమామాలిని, సూపరింటెండెంట్ శ్రీహరి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా ప్రతి ఒక్కరికి సుద ర్శనభాగ్యం కల్గించారు. భక్తు లకు దేవస్థానం ప్రసాదాలను అందించారు.

### నెమలి వాహనంపై

## స్వామివారు ఊరేగింపు

పాకాల ఆగస్టు 6, ప్రభాతవార్త

పాకాల మండలం ఉప్పరపల్లె పంచాయతీలోని ఊట్లవారిపల్లె సమీపాన ఆనందగిరి కొండపై వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి వారి 78వ ఆడికృత్తిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా మూడవరోజు గురువారం ఉదయం యాగపూజ, భరణి అభిషేకం, షణ్ముఖ సహస్రనామార్చన మంగళహారతి, స్వామికి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో భరణి దీపోత్స వం అట్టహాసంగా నిర్వహించారు. చిన్న గోర్పాడు గ్రామానికి చెందిన రాయ యశోదమ్మ రెడ్డయ్య చౌదరి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి ఉత్స వ మూర్తులను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలో మయూర వాహనంపై ఆశీనుల్ని చేసి గురువారం రోజు రాత్రి గ్రామంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరు కాగా ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణలతో మొదలైన పల్లకీ సేవ, మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ ఆధ్యాంతం స్కంధుని ఊరేగింపు కన్నుల విందుగా సాగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.



నెమలి వాహనంపై విహరిస్తున్న సుబ్రమణ్యస్వామి

### ప్రభుత్వ ఆసుపత్రిలో

## కమిటీ విచారణ

### వైరల్ వీడియోపై విచారణ పూర్తి.. కలెక్టర్‌కు నివేదిక



చిన్నగొట్టిగల్లు, ఆగస్టు 6 ప్రభాతవార్త

చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగి పట్ల వైద్యుడు దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలతో సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడి యోపై తిరుపతి జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించారు. ఘటనకు సం బంధించిన వాస్తవాలను తెలుసుకునేందుకు ప్రత్యేక విచారణ కమిటీని నియమించి, సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై. మురళీకృష్ణ, పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.చంద్రశేఖర్, చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రి సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణతో కూడిన కమిటీ చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని ఘటనపై విస్తృతంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యుడుని, వీడియోను సోషల్ మీడియాలో అప్లోడ్ చేసిన రోగి తరపు అటెండర్‌ను, విధుల్లో ఉన్న నర్సులను, ఘటన సమయంలో ఆసుపత్రిలో ఉన్న ఇతర రోగులను, వారి వెంట వచ్చిన అటెండర్లను విడివిడిగా ప్రశ్నించి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, వీడియోలో కనిపిస్తున్న అంశాలు, ప్రత్యక్ష సాక్షుల వాదనలు వంటి అన్ని కోణాలను పరిశీలించి వివరాలను సేకరించారు. విచారణలో భాగంగా ప్రతి ఒక్కరి నుంచి లిఖితపూర్వక స్టేట్‌మెంట్‌లు తీసుకుని, వాటిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం పూర్తి నివేదికను తిరుపతి జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, వైద్య సిబ్బంది, రోగుల మధ్య పరస్పర గౌరవం, బాధ్యతాయుతమైన వ్యవహారం ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం వేగంగా స్పందించి విచారణ కమిటీని నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పుడు కమిటీ నివేదిక ఆధారంగా తీసుకునే నిర్ణయాలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.

# సెజ్‌లో రూ.3వేల కోట్లతో సోలార్ సెల్ తయారీ ప్లాంట్

### త్వరలో ప్లాంట్ ప్రారంభం . . నిర్మాణ దశలో 4,500 మందికి ఉపాధి.. 3,000 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు.. :జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 6 ప్రభాతవార్త

నాయుడుపేట సెజ్‌లో రూ.3,000 కోట్ల పెట్టుబడితో ప్రీమియర్ ఎనర్జీస్ 7 గిగావాట్ల సోలార్ సెల్ తయారీ ప్లాంట్ నిర్మాణం తో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి లభించనుందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. భారతదేశంలో ప్రముఖ సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ సంస్థగా ఉన్న ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ నాయుడుపేట సెజ్ పారిశ్రామిక ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న 7 గిగావాట్ల సోలార్ సెల్ తయారీ ప్లాంట్ పురోగతిపై సంస్థ ప్రతినిధులు గురువారం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ను కలసి వివరించారు. ఈ సమావేశంలో ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ డైరెక్టర్లు రేవతి రోహిణి, సుధీర్ రెడ్డి మూలా, సంస్థ సలహాదారు రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. నాయుడుపేట సెజ్‌లో ఏర్పాటు చేస్తున్న 7 గిగావాట్ల సోలార్ సెల్ తయారీ ప్లాంట్‌లో ఇప్పటి వరకు సుమారు రూ.3,000 కోట్ల పెట్టు బడి పెట్టినట్లు సంస్థ ప్రతినిధులు కలెక్టర్ కు వివరించారు. ప్లాంట్ నిర్మాణ దశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4,500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు వివరించారు. ప్లాంట్‌కు అవసరమైన విద్యుత్ సరఫరాను ఏపీ ట్రాన్స్కో ఏపీఎస్పీడీసీఎల్ ద్వారా ఆగస్టు 5వ తేదీన అందుకున్నట్లు సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. రానున్న రెండు నెలల్లో ప్లాంట్‌ను ఉత్పత్తికి సిద్ధం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నట్లు వివరించారు. ప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభమైన అనంతరం 3,000 మందికి పైగా ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు లభించ నున్నాయని తెలిపారు. ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ తమ ఉద్యోగుల కోసం ఓజిలి మండలం అత్తివరం గ్రామంలో అందుబాటు ధరలో నివాస గృహాలను అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ, ఏపీఐఐ సి జోనల్ మేనేజర్ విజయ్ భారత్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ ఈ చంద్ర శేఖర్ రావు, ఆర్ అండ్ బి ఎస్ ఈ రాజానాయక్, తుడా అధికారులు, ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఏపీ టెట్2026 పరీక్షలు

### తిరుపతి జిల్లాలో 83 శాతం హాజరు: డిఈఓ



తిరుపతి విద్య, ఆగస్టు 6 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్-2026) రెండో రోజు పరీక్షలు తిరుపతి జిల్లా వ్యాప్తంగా నిర్ణీత కేంద్రాల్లో అత్యంత ప్రశాంత వాతావరణంలో, కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ముగిశాయి. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డిఈఓ) గురువారం వెల్లడించారు.రెండో రోజు నిర్వహించిన పరీక్షలకు గాను జిల్లాలోని వివిధ కేంద్రాల పరిధిలో మొత్తం 112 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు కేటాయించగా, వారిలో 93 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. కాగా 19 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని, మొత్తంగా 83 శాతం హాజరు నమోదు కావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తుగానే అవసరమైన తాగునీరు, విద్యుత్, ఇతర మోలిక వసతులను కేంద్రాల్లో పక్కాగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు మరియు విద్యాశాఖ అధికారులు పరిపూర్ణ సమన్వయంతో విధులు నిర్వహించారన్నారు. పటిష్ట పర్యవేక్షణ చేపట్టినట్లు డిఈఓ స్పష్టం చేశారు.

## విద్యార్థులకు పక్కాగా మౌళిక సౌకర్యాలు

### - బిసీ సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేసిన జిల్లా స్థాయి కమిటీ



చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త:

చిత్తూరు సంజయ్ కాలనీలోని బిసీ వెల్ఫేర్ హాస్టల్‌ను గురువారం జిల్లా స్థాయి సంయుక్త కమిటీ తనిఖీ చేసింది. హాస్టల్‌ను తనిఖీ చేసిన జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ, ఫుడ్ సేఫ్టీ అధికారి, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఎస్ఇ అధికారుల బృందం హాస్టల్ అధికారులకు పలు సూచ నలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు హాస్టల్ పరిసరాల్లో పారిశుధ్యం, విద్యార్థులకు అందిస్తున్న ఆహారపదార్థాల నాణ్యత, వంటగది పరిశుభ్రత, మంచినీటి సౌకర్యం, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు, మరుగుదొడ్ల నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, మౌళిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ సిఇఓ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన పోషకాహారంతో నాణ్యమైన భోజనం అందించాలని, హాస్టల్ ప్రాంగణంను ఎల్లప్పుడు పరిశుభ్రంగా వుంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## డిస్ట్రిక్ సెన్సెస్ హ్యాండ్‌బుక్‌పై శిక్షణ

### గ్రామాలు-పట్టణాల సమగ్ర డేటా సేకరణకు దోహదం:ఏఎస్ఓ గోవర్ధన్



తిరుపతిరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:

గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన సమగ్రమైన సమాచారాన్ని అందించే డిస్ట్రిక్ సెన్సెస్ హ్యాండ్‌బుక్ (డిసిహెచ్‌బి)-2027ను డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించుకోవాలని తిరుపతిరూరల్ స్టాటటిక్స్ ఏఎస్ఓ గోవర్ధన్ సూచించారు. జనాభా లెక్కల గణన 1951 నుంచి ప్రారంభమైందని, కాలానుగుణంగా ఈప్ర క్రియ మరింత విస్తరించి ఆధునిక రుపాన్ని సంతరించుకుందని తెలిపారు. గురువారం తిరుపతిరూరల్ ఎంపిడిఓ సమావేశ మందిరములో నిర్వహించిన ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణా కార్యక్రమంలో తిరుపతిరూరల్, రామచంద్రాపురం, చంద్రగిరి మండలాల విఆర్వోలు, పంచాయతీ కార్యధర్శులు పాల్గొన్నారు. సెన్సెస్ హ్యాండ్‌బుక్ విధి విధానాలు, డేటా సేకరణ విధానం, ఖచ్చితత్వం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్య, వైద్య సదుపాయాలు, తాగునీటి వనరులు, బ్యాంకింగ్ సేవలు, కమ్యూనికేషన్ సౌకర్యాలు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, భూమిని వినియోగం వంటి అంశాలపై సమగ్ర డేటా సేకరణ అవసరాన్ని వివరించారు. డిస్ట్రిక్ సెన్సెస్ హ్యాండ్‌బుక్ ద్వారా గ్రామాల నుంచి పట్టణాల వరకు అన్ని రంగాల అభివృద్ధి స్థితిగతులను సమగ్రంగా అంఛనా వేయవచ్చునని, భవిష్యత్ ప్రణాళికలను ఇది మార్గదర్శకంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ తహశీల్ధార్ జనార్ధన్‌రాజు, రామచంద్రాపురం తహశీల్ధార్ మధుసూధన్, డిటి చంద్రకళ, డిప్యూటీ ఎంపిడిఓ దయాసాగర్ పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### - టిడిపి జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి



వెంకటగిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త :

అభివృద్ధి సంక్షేమమే కోటమీ ప్రభుత్వ లక్ష్యమని టిడిపి జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని పారవోలు గ్రామంలో వెంకటగిరి శాసన సభ్యుడు కురుగొండ్ల రామకృష్ణ, పి. లక్ష్మి కోటి 40 లక్షల రూపాయలు నిర్మించే రోడ్డును ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ పేదల కోసం అనేక సంక్షేమ పథకా లు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగానే గ్రామంలో నూతనంగా కోటి 44 లక్షలతో నిర్మించిన తారురోడ్డును ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షురాలు కలిసి శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులుతో పాటు జిల్లా ఉపాధ్యక్షులు, మండల తనుజ రెడ్డి, నాయకులు చంద్రమౌళి రెడ్డి, మురళి గౌడ్‌లు పాల్గొన్నారు.

# తొలి దశలో 730 ఇళ్ళ నిర్మాణాలకు చర్యలు : కలెక్టర్



చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త:

చిత్తూరు నగరానికి సమీపంలోని అనుపల్లి లేఅవుట్‌లో తొలి దశ(ఎన్‌పిఐఫేజ్-1) కింద 730 ఇళ్ళ నిర్మాణాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు గురువారం అనుపల్లి లేఅవుట్‌కు సమీపంలో నూతన ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ నిర్మించడానికి అవసరమైన స్థలంను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కమార్, ఎమ్మెల్యే గురజాలలు మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీలోపు ఇల్లు లేని నిరుపేదల జాబితాను సిద్ధం చేయాలని, లబ్దిదారులకు ఇంటి నివాస ధృవపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. అనుపల్లి లేఅవుట్‌లో మొత్తం 2,390 ప్లాట్లు వున్నాయని, అందులో తొలి దశలో 730 ఇళ్ళ నిర్మాణాలకు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ లేఅవుట్ నగరానికి 5 కిమీ దూరంలో వుండి ప్రజలకు అనువుగా వుందన్నారు. తొలి దశలో ఓసీలకు 109, బిసీలకు 425, ఎస్సీలకు 183, ఎస్టీలకు 13 మంది లబ్దిదారులకు ఇళ్ళు కేటాయిస్తున్నామన్నారు. ఈ లేఅవుట్‌లో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బోర్‌వెల్ వేసి మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం ఇప్పటికే కల్పించడం జరిగిందన్నారు. అయితే గ్రావెల్ రోడ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో సికె లావణ్యబాబు, హౌసింగ్ పిడి సుబ్రమణ్యం, డిఇ శ్రీధర్, తహసిల్దారు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చెంగాళమ్మకు శాకాంబరి అలంకారం



సూళ్లూరుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన శ్రీ చెంగాళమాత పరమేశ్వరీ దేవికి ఆషాడ మాస ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం శాకాంబరి అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. జూలై 27వ తేదీన ప్రారంభమైన ఆషాడ మాస ఉత్సవాలను పురస్కరించుకొని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్, కోమలి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి అమ్మణ్ణికి కన్నుల పండువగ కళాశాభిషేకంతో పాటు చండియాగాన్ని నిర్వహించారు. అలాగే వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ దంపతులు ఉభయకర్తలుగా శ్రీ చెంగాళమ్మకు శాకాంబరి అలంకారాన్ని చేశారు. ఈ సందర్భంగా దేవస్థానంలోని అమ్మణ్ణి ముంగిట బలిపీఠం వరకు వివిధ రకాల కూరగాయలు, పండ్లుతో అలంకరించి ఆలయాన్ని శోభయామానంగా తీర్చిదిద్దారు. అలాగే దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ వినాయక స్వామి, శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి శాకాంబరి అలంకారాన్ని చేశారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అమ్మణ్ణి దర్శన భాగ్యాన్ని కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీ చెంగాళమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తానంకి నానాజీ, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, అభివృద్ధి కమిటీ చైర్మన్ తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ ఏజీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## లక్షల కోట్ల రూపాయలతో సంక్షేమం : ఎమ్మెల్యే



వెంకటగిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త: ఒకటిన్నర లక్షల కోట్ల రూపాయలతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణం 11వ వార్డు రాణి పేటలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయింది సందర్భంగా ఇంటింటికి తిరిగి అమలు చేస్తున్నారు. సంక్షేమ పథకాలు గురించి కరపత్రాలు ఎమ్మెల్యే పంపిణీ చేసి వివరించారు. ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అవినీతి తప్ప అభివృద్ధి లేదనే విమర్శించారు. కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## రామలింగేశ్వరరావుకు జాతీయ అనుభవ్-2026 అవార్డు



సూళ్ళూరుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త: శ్రీహరికోటకు చెందిన ప్రముఖ త్రిభాషా రచయిత, కళాకారుడు, స్పేస్ సెంటర్ స్కూల్ రిటైర్డ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయుడు డాక్టర్ అయినాపురపు రామలింగేశ్వర రావుకు మినిస్ట్రీ ఆఫ్ పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్, డిపార్ట్మెంట్ ఆఫ్ పెన్షన్ అండ్ పెన్షన్ వెల్ఫేర్ వారి విశిష్టాత్మకమైన నేషనల్ అనుభవ్ అవార్డు-2026 అవార్డుకు ఎంపికయ్యారు. హిందీ, తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో డాక్టర్ అయినాపురపు వ్రాసిన సుమారు 25 గ్రంథాలు మార్కెట్లో లభ్యం అవుతున్నాయి. ఈ నెల 17 ఆగస్టున న్యూఢిల్లీలో, విజ్ఞాన్ భవన్ జరుగుతున్న ప్రత్యేకమైన కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ పర్సనల్ పబ్లిక్ గ్రీవెన్సెస్, పెన్షన్ కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం మంత్రుల చేతుల మీదుగా జాతీయ నేషనల్ అనుభవ అవార్డు 2026ను డాక్టర్ రామలింగేశ్వర రావు అందుకోబోతున్నారు. జాతీయ అవార్డును అందుకుంటున్న ఈ సందర్భంగా డాక్టర్ రామలింగేశ్వర రావుకు శ్రీహరికోటకు చెందిన ఉద్యోగస్తులు, నగర ప్రముఖులు, స్పేస్ సెంటర్ స్కూల్, పూర్వ విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు




సూళ్ళూరుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త: ఐసీడీఎస్ ప్రాజెక్టు, సూళ్లూరుపేట పరిధిలో ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా గురువారం సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ హెల్పర్లతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డా. జగదీష్ బాబు మాట్లాడుతూ తల్లిపాల యొక్క విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ కన్వీనర్ అరుణకుమారి, సూపర్వైజర్ మనూష సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు రూ.42 లక్షలతో మౌలిక వసతులు



సూళ్లూరుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త: శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో శ్రీసిటీకి చెందిన ఐసాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, తమ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం మన్నారు పోలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించింది. సుమారు రూ.42 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో గ్రంథాలయ భవన నిర్మాణం, తరగతి గదుల మరమ్మతులు, ఆర్వో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు, సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు, ఫర్నిచర్ ఏర్పాటు, పాఠశాల ప్రాంగణంలో పచ్చదనం పెంపు వంటి పనులు చేపట్టారు. ఐసాన్ ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్ యసునోరి సకౌయే, ప్లాంట్ హెడ్ యుయిచా టోమిటా, శ్రీసిటీ ఫౌండేషన్ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్.కుమార్ కార్యక్రమంలో పాల్గొని, నూతనంగా నిర్మించిన వసతులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా యసునోరి సకౌయే మాట్లాడుతూ శ్రీసిటీ పరిసర ప్రాంతాల అభివృద్ధికి సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఐసాన్ సీఎస్సార్ చర్యలను అభినందించిన నిరీషా సన్నారెడ్డి, పరిశ్రమల భాగస్వామ్యంతో శ్రీసిటీ ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ విద్యార్థుల నమోదు, విద్యా ఫలితాల పెరుగుదలకు కృషి చేస్తోందని చెప్పారు. సత్యవేడు, వరదయ్యపాలెం, సూళ్లూరుపేట, తడ మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శ్రీసిటీ పరిశ్రమలు చేస్తున్న సేవలను జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్.కుమార్ ప్రశంసించారు. తమ పాఠశాలకు వసతుల కల్పన పట్ల ఐసాన్ సంస్థకు, శ్రీసిటీకి ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఐసాన్ పరిశ్రమ ప్రొడక్షన్ కోఆర్డినేటర్ తొషిహిరో సనో, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ గోపాల్, జనరల్ మేనేజర్ (మ్యానుఫ్యాక్చరింగ్) దేవనాదన్, స్కూల్ టీచర్లు, విద్యార్థులు, శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చేనేతలకు ప్రభుత్వ ఆర్థిక సాయం హర్షనీయం



సూళ్ళూరుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రవేశపెట్టిన నేతన్న సేవలో పథకం కింద ప్రతి అర్హత కలిగిన చేనేత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందించనున్న నిర్ణయాన్ని దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధి, చేనేత నాయకురాలు బుద్ది విజయలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్ల ఆర్థిక సహాయం అందించడం చేనేత రంగానికి గొప్ప ఊతమని పేర్కొన్నారు. చేనేతలకు ప్రభుత్వ ఆర్థిక సాయం హర్షనీయం.

## భాజపా మాజీ మండలాధ్యక్షుడుకు పరామర్శ



చిట్టమూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త: చిట్టమూరు మండల భారతీయ జనతా పార్టీ మాజీ అధ్యక్షులు దువ్వూరు శరత్ చంద్రారెడ్డి తండ్రి దువ్వూరు దశరథ రామిరెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి సురేంద్రనాథ్ రెడ్డి, తిరుపతి జిల్లా మాజీ కార్యదర్శి పాలిచర్ల బైరప్ప అరవపాలెం గ్రామానికి విచ్చేసి కుటుంబ సభ్యులను పరామర్శించి దశరథరామిరెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడం జరిగింది. ఈ పరామర్శలో సురేందర్‌రెడ్డి వెంట భాజపా యువజన నాయకులు అంకయ్య ఉన్నారు.

## వాటర్ కూలర్ బహుకరణ



సూళ్ళూరుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త: తిరుపతిలోని రుయా ఆసుపత్రికి సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవా సంస్థ దాతృత్వంతో 50 వేల రూపాయల విలువచేసే వాటర్ కూలర్‌ను గురువారం బహుకరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అడిషనల్ డీఎంఈ డాక్టర్ మనోహర్, ఏఆర్ఎండి డాక్టర్ హరికృష్ణ, ఏవో డాక్టర్ శ్రావణ్ కుమార్, హెచ్ఓడి డాక్టర్ చలపతిరావు, ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలకు వస్త్రములు, పాదరక్షలు పంపిణీ



వాకాడు, ఆగస్టు 6 ప్రభాతవార్త: మండలంలోని బాలిరెడ్డి పాళెం గ్రామంలో శ్రీ పట్టాభిరామాల యంలో శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సువాసినీ పూజ జరిపించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ధర్మకర్తలు, మాజీ సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి చేతుల మీదుగా 22 మంది మహిళలకు సువాసినీ పూజలు గావించి చీరలు, పాదరక్షలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రవాస భారతీయులు పాలవలస వేంకట సాయి కృష్ణ పూర్ణచంద్రరావు, మీనా దంపతులు వారి సంతానం అశ్రిత్, అముక్త, అద్వైత్ కుటుంబ సభ్యుల 20వేల రూపాయల ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సుశాంతి, వంశీ ప్రియ, రాజ్యలక్ష్మి, దీవి అనంతబాబు, అరసి నరేష్ శర్మ, హేమంత్ శర్మ, సాయిబాబు, లోకేష్ కుమార్, శివ, శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఒక నెల ఒక గ్రామం



దొరవారిసత్రం, ఆగస్టు 6 ప్రభాతవార్త: మండలంలోని చందనమూడి గ్రామ పంచాయతీలోని భూ సమస్యల పరిష్కరించేందుకు స్థానిక తహసిల్దార్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక నెల ఒక గ్రామం అనే వినూత్నమైన ప్రయత్నంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గ్రామంలోని సమస్యలను పరిష్కరించే దిశగా మండల తాసిల్దార్ ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని అంతే కాకుండా ఏ గ్రామంలో భూ సమస్య వచ్చినా స్వయంగా ఆ గ్రామానికి వెళ్లి పరిష్కరిస్తు న్నారని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు మండల రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగే తిరిగి చెప్పులు అరికేవే గాని కానీ సమస్యలు మాత్రం పరిష్కారం అయ్యేది కాదని ప్రజలు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రామకృష్ణ ఆ గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ చెంగాళమ్మకు సారే సమర్పించిన ఎమ్మెల్యే



సూళ్ళూరుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త: ఆషాడ మాస ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ చెంగాళమ్మ దేవస్థానంలో జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగాస్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గురువారం అమణ్ణికి భక్తి పూర్వకంగా సారెను సమర్పించారు. శ ాకాంబరి అలంకారంతో కొలువై ఉన్న అమ్మణ్ణి ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానానికి వచ్చిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులకు దేవస్థాన సహాయ కమిషనర్ బి ప్రసన్న లక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించి అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలోమాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, అభివృద్ధి కమిటీ చైర్మన్ తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఎఫ్ఎస్‌సి ఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, నాగిశెట్టి పార్థసారథి, పి.మాధవ నాయుడు, చిట్టేటి పెరుమాళ్ళు, వేమసాని శ్రీనివాస నాయుడు, దంతాల రవి, కొమరంజేరి శ్రీధర్, సెట్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలేరమ్మ జాతర



వెంకటగిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త: పట్టణంలోని బీసీ కాలనీలో గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతర వైభవంగా జరిగింది. అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. పోలేరమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దర్శించుకుని పూజలు నిర్వహించారు. బీసీ కాలనీలో గత కొన్ని సంవత్సరాలు తర్వాత జాతర నిర్వహిస్తున్నారు. అమ్మవారు భక్తుల పూజల అనంతరం నిమజ్జనం చేస్తారు. ఎమ్మెల్యే తో పాటు ఏఎంసి చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## వ్యాసాశ్రమానికి...పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యం

**-జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌కి విన్నవించిన ఎమ్మెల్యే, సాధువులు**




తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 6 ప్రభాతవార్త :తిరుపతి జిల్లాలో ఆధ్యాత్మిక, విద్యా, సామాజిక రంగాల్లో విశిష్ట చరిత్ర కలిగిన ఏర్పేడు వ్యాసాశ్రమానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం సమగ్ర చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఏర్పేడు వ్యాసాశ్రమ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు అభివృద్ధి, నిర్వహణ, విద్యా కార్యక్రమాల పునరుద్ధరణ, ఆశ్రమ ఆస్తుల పరిరక్షణ, పరిపాలనా వ్యవస్థను పటిష్టం చేయడం తదితర అంశాలపై శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, పీఠాధిపతులు, పూర్వ విద్యార్థులు, ఆశ్రమంతో అనుబంధం ఉన్న స్వామీజీలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాసాశ్రమం వంటి ప్రసిద్ధ ఆధ్యాత్మిక, విద్యా సంస్థ జిల్లాలో ఉండటం మనందరికీ గర్వకారణమన్నారు. గతంలో విద్య, ఆధ్యాత్మికత, సంస్కారం, సేవా కార్యక్రమాల్లో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన వ్యాసాశ్రమం కాలక్రమేణా ఆశించిన స్థాయిలో కార్యకలాపాలు కొనసాగించలేకపోవడం బాధాకరమన్నారు. వ్యాసాశ్రమ అభివృద్ధి కోసం సమర్థవంతమైన కమిటీ లేదా ట్రస్ట్ ఏర్పాటు చేయాల్సిన అవసరంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కమిటీలో 11 మంది సభ్యులా, 21 మంది సభ్యులా అనే అంశంపై సంబంధిత పీఠాధిపతులు, పూర్వ విద్యార్థులు, భక్తులు సమాలోచన చేసి నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. వ్యాసాశ్రమ శతాబ్ది ఉత్సవాలను అత్యంత ఘనంగా, అందరి భాగస్వామ్యంతో నిర్వహించాలంటే తగిన సమయం, సమగ్ర ప్రణాళిక అవసరమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ముందుగా ఆశ్రమానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించి, అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన అనంతరం శతాబ్ది ఉత్సవాలను నిర్వహించడం సముచితమని పేర్కొన్నారు. పోలీసుశాఖకు సంబంధించిన బందోబస్తు, సెప్టెంబర్ నెలలో జరిగే ఇతర ప్రధాన కార్యక్రమాలు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని శతాబ్ది ఉత్సవాలను వాయిదా వేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశానికి హాజరు కాలేకపోయినందున, వారికి అధికారికంగా సమాచారం అందించి మరోసారి సమావేశానికి ఆహ్వానించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్ని పక్షాల వాదనలు, అభిప్రాయాలు తెలుసుకుని, ఎవరినీ పక్కన పెట్టకుండా సామరస్య పూర్వకంగా సమస్యకు పరిష్కారం కనుగొనడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాసాశ్రమం ప్రైవేట్, ఆధ్యాత్మిక సంస్థగా ఉన్నందున రాజకీయ జోక్యం లేకుండా సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఆలయ చైర్మన్ కోలా ఆనంద్ మాట్లాడుతూ, వ్యాసాశ్రమానికి గతంలో ఉన్న విద్యా, ఆధ్యాత్మిక, సామాజిక ప్రాధాన్యతను తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఎస్పీఎల్. సుబ్బ రాయుడు మాట్లాడుతూ వ్యాసాశ్రమానికి సంబంధించిన కార్యక్రమాలు శాంతియుతంగా, అందరి సహకారంతో నిర్వహించేందుకు పోలీసు శాఖ అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. పలువురు పీఠాధిపతులు మాట్లాడుతూ వ్యాసాశ్రమా నికి గతంలో ఉన్న విద్యా ప్రాధాన్యతను తిరిగి తీసుకురావాలని సూచించారు. బ్రహ్మవిద్యా పాఠశాల, గురుకుల విద్య, కన్యా గురుకులం వంటి విద్యా కార్యక్రమాలను నిబంధనల ప్రకారం పునఃప్రారంభించి, విద్యార్థులకు ఆధ్యాత్మికత, విద్య, సంస్కారం కలగలిపిన విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ నరసింహులు, శ్రీకాళహస్తి మార్కెటింగ్ యార్డ్ చైర్మన్ చెంచయ్య, పోలీసు శాఖ అధికారులు, జిల్లా దేవాదాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, పీఠాధిపతులు, స్వామీజీలు, వ్యాసాశ్రమం పూర్వ విద్యార్థులు, సీనియర్ భక్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై... సిబిఐ చేత విచారణ జరపాలి : నేదురుమల్లి



వెంకటగిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంలో నిర్వహించిన డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సిబిఐ చేత విచారణ జరిపించాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం మండల పరిషత్ కార్యాలయం కూడలి డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సిబిఐ చేత విచారణ జరపాలని పలువురు నిరుద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు రామ్‌కుమార్‌రెడ్డి మద్దతు తెలిపారు. డీఎస్సీ నియామకాలు అక్రమాలు జరిగాయని విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని కూడా యువత డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాలో భారీగా అక్రమాలు జరిగాయని నిరుద్యోగులు ఆరోపిస్తున్నట్లు చెప్పాడు. కూటమి ప్రభుత్వం ఎందుకు సిబిఐ చేత విచారణ జరిపించడం లేదు అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కోడూరు కల్పలత రెడ్డి, మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, మండల పార్టీ కన్వీనర్లు శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాయకులు దశరథ రామ్‌రెడ్డి, సతీష్, రాజారెడ్డి, సిపిఎల్ నరసింహారావు, మాజీ కౌన్సిలర్లు కళ్యాణి, పూజారి లక్ష్మి, శ్రీనివాసులు, విశ్రాంత ప్రిన్సిపాల్ బి.కె ప్రసాద్, వివి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఊట్లవారిపల్లె సుబ్రమణ్య స్వామికి... గణనాధుని పట్టువస్త్రసాలు





కాణిపాకం, ఆగస్టు 6 ప్రభాతవార్త: పాకాల మండలం ఊట్లవారిపల్లె పాళ్యం కొండపై వెలసిన శ్రీవళ్లి దేవయాని సమేత శ్రీసుబ్రమణ్య స్వామి వారికి సత్యప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానం తరపున గురువారం పట్టువస్త్రాలను అందజేశారు. ప్రతిఏటా దేవస్థానంలో జరుగు ఆడికృత్తిక ఉత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు కాణిపాకం దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ పెంచల కిషోర్,చైర్మన్ వి.మణినాయుడు, అర్చకులు, వేదపండితులు పట్టువస్త్రాలను తీసుకెళ్ళగా, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, వారి కుటుంబసభ్యులతో కలసి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్ళి స్వామివారికి సమర్పించారు. వీరికి సుబ్రమణ్యం స్వామివారి దేవస్థానం ఛైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, ఈఓ యువరాణి, అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలను స్వామి, అమ్మవార్లకు ముందు వుంచి ప్రత్యేకపూజలు చేశారు. అలాగే ఎమ్మెల్యేలు మురళీమోహన్, పులివర్తి నాని దంపతులకు స్వామివారి దర్శనానంతరం తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం స్థానాచార్యులు పణిస్వామి, పాలకమండలి సభ్యులు పద్మలత, అనుసూయ, వసంతమ్మ, సూపరెండెంట్ వాసు, ఆలయ అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబునాయుడుకే సాధ్యం

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు(నగరి), ఆగస్టు 6 ప్రభాతవార్త : ఒక వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమాన్ని ఏక కాలంలో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. గురువారం నగరి మండలంలోని ఎస్.వి.పురం గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాన్, ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఉమ్మడి కృషి వల్ల రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. మరమగ్గాలకు ఉచిత కరెంట్ ఇవ్వడం వల్ల నగరి నియోజకవర్గంలో వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో జరిగిన నష్టాన్ని పూడుస్తూ మన బిడ్డలకు మంచి భవిష్యత్ ఇవ్వాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధంగా ఎక్కడా విధ్వంసం, దౌర్జన్యాలు చోటుచేసుకోవడం లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు శాంతిభద్రతల విషయంలో కూడా కూటమి ప్రభుత్వం రాజీ పడడం లేదని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో నగరి మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు పంటలను కాపాడుకోవాలి



వెంకటగిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త: ఎల్ నీనో పరిస్థితుల నుండి రైతులు పంటలు కాపాడుకోవాలని ఏడిఏ డాక్టర్ పి.అనసూయ రైతులకు సూచించారు. పారవోలు రైతు సేవా కేంద్రం పరిధిలో సీసీ కండ్రిగ గ్రామం నందు ఎల్ నినో పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశమునకు ఆచార్య ఎన్జీరంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతి శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతిమ, డాక్టర్ జాన్, పొదలకూరు ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ పుల్లంరాజు, హసీనా, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ పి.లత, ఎన్.వాణి, వ్యవసాయ కళాశాల విద్యార్థులతో వెంకటగిరి మండలం సీసీ కండ్రిగ గ్రామంలో సందర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పి. సుజాత వ్యవసాయ విస్తరణ అధికారి, ఎస్పి. రామ్మోహన్, గ్రామ వ్యవసాయ గ్రామ సహాయకులు మానస, రైతులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాల అవగాహన

తిరుపతి, ఆగస్టు 6 ప్రభాతవార్త: తిరుపతి అర్బన్ పరిధిలోని నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రాలలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సమాజసేవా విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. శిశువుల సమగ్ర ఎదుగుదలకు, రోగనిరోధక శక్తి పెంపునకు మరియు ఆరోగ్యానికి తల్లిపాలు ఎంత కీలకమైనవో తెలియజేయడమే లక్ష్యంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నవచేతన స్క్రీనింగ్ ప్రోగ్రామ్ విశ్వవిద్యాలయ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఐ. వి. లలిత కుమారి అవగాహన కల్పించారు. సమాజసేవా విభాగానికి చెందిన ఎం.ఎస్.డబ్ల్యూ విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్లు దారిపోయినవి

తుపాకుల కిరణ్ (19), తండ్రి రమేష్, దుగ్గరాజపట్నం గ్రామం, వాకాడు మండలం, తిరుపతి జిల్లా అనే నేను దుగ్గరాజపట్నం నుండి వాకాడుకు పోయి వస్తున్న సందర్భంలో నా ఒరిజినల్ పదవ తరగతి (మార్చి-2024) మార్కులు సర్టిఫికెట్ మరియు జడ్పి హైస్కూల్, దుగ్గరాజపట్నం పాఠశాల ఎస్.ఎస్.సి హాల్ టిక్కెట్ నెం.2419107363 దార పోయినవి. నేను ఎంత ప్రయత్నించినా దొరకలేదు. కావున ఏవరికైనా నా సిర్టిఫికేట్లు దొరికి యెడల,పై అడ్రస్సుకు తెలియ పరచగలర మనవి చేస్తున్నాను.

# శ్రీకాళహస్తి డివిజన్

## పూడి గ్రంథాలయం తనిఖీ



తొట్టంబేడు, ఆగస్టు 6 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం పూడి పంచాయతీలో ఉన్నటువంటి జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా నడుస్తున్న బీడీసీ సెంటర్‌ను గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రెడ్డివారి గురువారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హాజరు రిజిస్టర్లు అటెండెన్స్ రిజిస్టర్ను పత్రికలకు సంబంధించిన పిరియాడికల్ రిజిస్టర్లును పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో గ్రంథాలయాల అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో పని చేస్తా అన్నారు. పూడి గ్రామస్తులు మాధవ నాయుడు చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు శాఖ గ్రంధాల అధికారి హరికృష్ణ గ్రామస్తులు శేషమ నాయుడు మాధవ నాయుడు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## గుమ్మిడిగుంట గిరిజనకాలనీలో ఇంటింటి ప్రచారం



తొట్టంబేడు ఆగస్టు 6 ప్రభాతవార్త : తొట్టంబేడు మండలం లింగమ్మ నాయుడుపల్లి గ్రామం ఎస్టి కాలనీ నందు టీడీపీ నాయకుడు రావిళ్ల ముని రాజనాయుడు ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి (డోర్‌టుడోర్) ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రతి ఇంటిని సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో కొనసాగు తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఎల్లప్పుడూ కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాలి చలపతి నాయుడు, డి.రామనాయుడు, కోదండ, బి.భాస్కర్, ధాము, 9బూతుల యూనిట్ ఇన్‌చార్జీలు లెక్కల మురళి నాయుడు, జి.శంకర్ నాయుడు, మునిరాజ్ యాదవ్, భాస్కర్, బూత్ ఇన్‌చార్జీ జి.శ్రీను, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇసుక మాఫియాపై పంజా విసిరిన పోలీసులు



రేణిగుంట ఆగస్టు 6 ప్రభాతవార్త : జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో రూరల్ సీఐ మంజునాథ రెడ్డి ఆధ్వర్యంలో గాజులమండ్యం ఎస్సై హరీష తమ సిబ్బందితో చాకచక్యంగా వ్యవహరించి ఇసుక మాఫియా పై కొరడా ఝుళిపించి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రెండు కంటైనర్లు, ఒక ట్రాక్టర్, ఒక జెసిబి, కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే శ్రీకాళహస్తి నియోజకవర్గం ఊరందూరు గ్రామానికి చెందిన బాలాజీ (34) తిరుపతి జిల్లా తడ సమీపంలోని పెద్ద పూడి చెందిన అజిత్ (28 )లు రాజంపేట నుండి ఇసుకను ట్రిప్పర్లతో తరలించి రేణిగుంట మండలం కొత్రమంగళం పెనుబాల కాలేజీ వెనుక శివకుమారికి చెందిన వెంచర్ నందు డంప్ చేసేవారు. వెంచర్ లోపల ఐదు మంది వ్యక్తులు కంటైనర్ల ద్వారా తమిళనాడు పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లి అధిక ధరలకు అమ్ముతుండే వాళ్ళని పోలీసులు గుర్తించారు. ఎవరికి అనుమాన రాకుండా ఒక కారు పైలట్ గా వెళ్లేదని నిర్ధారించారు. పోలీసులు జరిపిన దాడుల్లో ఇసుక అమ్మకానికి పాల్పడుతున్న బాలాజీ, అజిత్ లతోపాటు పాటు డ్రైవర్లు చైత్ర సెల్వన్, రాజన్ యాదవ్, అనీష్‌కుమార్‌సింగ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం న్యాయస్థానానికి పంపారు.

## ఘనంగా 78వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు



పాకాల, ఆగస్టు 6 ప్రభాతవార్త: పాకాల మండలం ఊట్ల వారిపల్లె గ్రామంలో ఆనందగిరి కొండపై వెలసిన ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్స వాలలో భాగంగా గురువారం చంద్రగిరి నియోజకవర్గ శాసన సభ్యులు పులివర్తి నాని దంపతులతో కలసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉత్సవాలలో భాగంగా కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయం నుండి సుబ్రహ్మణ్య స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించిన పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ దంపతులు. ఈ సందర్భంగా స్వామి అమ్మా వారికి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేల దంపతులకు ఆలయంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను, స్వామివారి జ్ఞాపికలను ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ పల్లికొండేశ్వర స్వామిని దర్శించుకున్న టీటీడీ ఈవో

**- దేవస్థానం అభివృద్ధి, పరిశుభ్రత, ప్రసాదాలను ప్రశంసించిన ఈవో**

నాగలాపురం, ఆగస్టు 6 ప్రభాతవార్త: నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానాన్ని టీటీడీ కార్యనిర్వహణాధికారి ముద్దాడ రవిచంద్ర గురువారం దర్శించుకున్నారు. టీటీడీ ఈవోకి ఆలయ చైర్మన్ డి.పద్మనాభరాజు, కార్య నిర్వహణాధికారిణి పి.లత, ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం శ్రీ దంపతి సమేత శ్రీ దక్షిణామూర్తి స్వామి, లవకుశ పాదాలు, శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, ప్రదోష పూజల విశిష్టతలను ప్రధాన అర్చకులు కార్తీకేశన్ ఈవోకు వివరించారు. ఈ సందర్భంగా ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ 2008లో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ఈ దేవస్థానాన్ని సందర్శించిన విషయాలను గుర్తు చేసుకున్నారు. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం దేవస్థానం ఎంతో అద్భుతంగా అభివృద్ధి చెందిందని, ఆలయ పరిశుభ్రత, భక్తులకు అందిస్తున్న ప్రసాదాల నాణ్యత ప్రశంసనీయంగా ఉన్నాయని అభినందించారు. దర్శనం అనంతరం ఆలయ ప్రదోష మండపంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామివారి జ్ఞాపిక(మెమెంటో), చిత్రపటాన్ని టీటీడీ ఈవోకి బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పి.హంస రుద్రయ్య, ఎస్.కృష్ణయ్య, కె.శ్రీనివాసులు, ఎస్.దేవి ధనశేఖర్, కె.కవిత, చంద్రశేఖర్, డి.నాగభూషణమ్మ, మస్తాన్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఘనస్వాగతం

రేణిగుంట, ఆగస్టు 6 ప్రభాతవార్త : 4జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానకు రేణిగుంట విమానాశ్రయంలో గురువారం రాత్రి ఘన స్వాగతం లభించింది. తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన కోసం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు విమానాశ్రయం నందు తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దెల గురుమూర్తి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ శంకర్ నాయక్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, రేణిగుంట తహసిల్దార్ శ్రవణ్ కుమార్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి సుధీర్ కుమార్, వైసీపీ నేత మాజీ సర్పంచి మణి, తూకివాకం మాజీ సర్పంచ్ వైసిపి యువ నేత మునిశేఖర్ రెడ్డి, ఎస్సీ నేత ఆనంద్, కుర్ర కాలవ వైసీపీ నేత అంబేద్కర్ నాగరాజులు ఉన్నారు..

## అథ్లెటిక్స్‌లో ఓవరాల్ ఛాంపియన్ తమిళనాడు



తిరుపతి,ఆగస్టు 6 ప్రభాతవార్త: తిరుపతిలో ముగిసిన 48వ అఖిలభారత ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అథ్లెటిక్, చెస్ ఛాంపియన్ షిప్, బాల్ బ్యాండ్మిటన్, క్యారమ్స్ టోర్నమెంట్ 202627లో భాగంగా అథ్లెటిక్స్ విభాగంలో తమిళనాడు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. అదే విధంగా కర్ణాటక రాష్ట్రం ద్వితీయ స్థానం లోనూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తృతీయ స్థానంలోనూ నిలిచాయి. ఇక బ్యాడ్మింటన్ పోటీల్లో తమిళనాడు మొదటి స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో ఆంధ్రప్రదేశ్, తృతీయ స్థానంలో కర్ణాటక నిలిచాయి. చెస్ పోటీల్లో తెలంగాణ మొదటి స్థానంలోనూ, కేరళ ద్వితీయ స్థానంలోనూ, ఆంధ్రప్రదేశ్ తృతీయ స్థానంలోనూ నిలిచాయి. ఇక క్యారమ్స్ పోటీల్లో తమిళనాడు మొదటి స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్ ద్వితీయ స్థానంలోనూ, కర్ణాటక తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో విజేతలకు ఎస్పీడీసీఎల్ సిఎండి శివ శంకర్ లోతేటి, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్ డి) కె.గురవయ్యల చేతుల మీదుగా ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. అదేవిధంగా గతంలో ఎస్పీడిసిఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్, తిరుపతి విభాగంలో విశిష్ట సేవలు అందించిన ఎం. కృష్ణారెడ్డి, పురుషోత్తంలను జ్ఞాపిక, దుశ్శాలువాతో సత్కరించారు.

## శ్రీకాళహస్తిలో వైకాపా రిలే నిరాహారదీక్షలు

**డిఎస్‌సి అక్రమాలపై సిబిఐ విచారణ జరగాలి : భూమన, బియ్యపు**






శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి వైకాపా కార్యాలయంలో గురువారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి సారధ్యంలో రిలే నిరాహార దీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ప్రారంభించటానికి ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షుడు, మాజీ తిరుపతి శాసనసభ్యుడు భూమన కరుణాకర్‌రెడ్డి హాజరయ్యారు. రెండేళ్ళ కూటమి పాలనలో చోటు చేసుకున్న సమస్యలపై సమరం తప్పదని అలాగే విద్యార్థి లోకానికి జరుగుతున్న రిఎంబర్స్‌మెంట్ చెల్లింపులకోసం రాజీలేని పోరాటం తప్పదని దీక్షను ప్రారంభించిన నాయకులు స్పష్టం చేసారు. డిఎస్‌సి నియామకాల్లో తెలుగుదేశం నాయకుడు తమ పార్టీ కార్యకర్తలకు 'పప్పు బెల్లాలా' స్పోర్ట్స్ కోటా కట్టబెట్టారన్నారు. స్పోర్ట్స్ కోటాలో కనీసం పతకాలుకూడా లేని వారికి ఛాంపియన్స్ పేరుతో కట్టబెట్టారన్నారు. అయితే కూటమి నాయకులు తమ వాదనను తప్పుదారి పట్టిస్తూ 16వేల మంది ఉద్యో గాలను ఇంటికి పంపమని తాము చెబుతున్న చేస్తున్న ప్రచారం అసత్యమన్నారు. అందుకే మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని కోరుతు న్నామన్నారు. ఇక నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. చదువుకున్న నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. ఒక్క రూపాయి కూడ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 20లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారన్నారు. తమ పార్టీ నాయకుడు జగనన్నకు ప్రజలకు మేలు చేయటం మాత్రమే తెలుసునని మోసం చేయటం చేత కాదన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ ప్రముఖులు అంజూరు తారక శ్రీనివాసులు, సిద్దాగుంట సుధాకర్‌రెడ్డి ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదనరెడ్డి, నియోజకవర్గ నాయకులు గంగారి రమేష్, అత్తూరు హరిప్రసాద్‌రెడ్డి, జడ్‌పిటిసి సంధ్యా, గున్నేరి కిషోర్‌రెడ్డి, రమణయ్య యాదవ్, డాక్టర్ కోగిల సుబ్రమణ్యం, కోవి చంద్రయ్యనాయుడు, కొత్తపాటి శ్రీనివాసులురెడ్డి, సిరాజ్‌బాషా, పఠాన్ ఫరీద్‌ఖాన్, గోరా, బంగారు దిలీప్, సూర సురేష్, వెంకటేశ్వర్లు నాయుడు, మునికృష్ణారెడ్డి, చింత రాజేంద్ర,పసల కృష్ణయ్య, నాగరాజు రెడ్డి, మున్నా రాయల్ బుల్లెట్ జయశ్యాం రాయల్, ప్రకాశం పంతులు, ఉత్తరాజి శరవణ కుమార్, సుమతి, సాగిరాబీ, షర్మిల ఠగూర్,సునీత సింగ్,పర్వీన్, రాజ్యలక్ష్మి, భారతమ్మ, చెంచయ్యనాయుడు, ఆర్కాటుముత్తు, పులిరామచంద్ర, గఫూర్, ఫజల్ తదితరులు నిరాహారదీక్షల్లో పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సన్నిధిలో ఆడికృత్తిక అభిషేకం



ఏర్పేడు,ఆగస్టు 6 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని సన్నిదిలో గురువారం ఆడికృత్తిక సందర్భంగా ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ముఖ్యంగా భక్తుల రాకతో ఆలయం కళ కళ లాడింది. ఆలయం ఆవరణలోని షణ్ముఖ స్వామి మూల విరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించారు. కృత్తిక సందర్భంగా ఆలయ చైర్మెన్ బత్తలగిరిబాబు నాయుడు ఇఓ మునిశేఖర్‌లు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. భక్తులకు సుదర్శన అవకాశం కల్పించారు.

## ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం పనులు




శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారెడ్డికి కుమార స్వామి ఉత్సవాలు మొదటి కావటంతో ఆయన పారిశుద్ధ్యం, లైటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపధ్యంలో గురు వారం ఆడికృత్తిక సందర్భంగా పట్టణానికి వేలాది మంది జనం వచ్చారు. అయితే ఎక్కడా కాగితం ముక్క కనబడకుండా తన సిబ్బంది ద్వారా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. నాలుగుమాడావీధుల్లోనూ. కుమారస్వామి కొండ పరిసరాల్లో పారిశుద్ధ్యంపై మున్సిపల్ సిబ్బంది చూపిన చొరవ అభినందనీయం. గురువారం ఉత్సవానికి ముందు మున్సిపల్ సిబ్బందితో కమిషనర్ కృష్ణారెడ్డి ఆదేశాలతో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మోతీలాల్, దామోదరం,పవన్‌ల పర్యవేక్షణలో సిబ్బంది పారిశుద్ధ్యం నిర్వహించారు. అలాగే మేస్త్రీ ల పర్యవేక్షణలో మున్సిపల్ కార్మికులు ఆలయానికి వచ్చే విఐపిలు మెచ్చుకునే రీతిలో పారిశద్ధ్య పనులు చేపట్టి పలువురి ప్రశంసలందుకున్నారు.

**స్వచ్ఛంద సంస్థల సేవలు:**

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చిన భక్తులకు సేవలందించుటకు ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చాయి. తమ సేవల్ని అందించారు. భోజనాలు రక రకాల పిండివంటల్ని వితరణగా అందించారు. జనం మెచ్చుకునే విధంగా బ్లీచింగ్ క్లీనింగ్, మంచినీటి సరఫరా నిర్వహించారు. ఆలయం వద్ద చైర్మెన్ ఇఓ తిష్టవేసి వచ్చిన భక్తులకు సత్వర దర్శనం,సుదర్శనం ఏర్పాటు చేయటంలో చొరవ చూపారు.

## భక్తుల సేవలో దేశం తమ్ముళ్ళు



శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో ఆడికృత్తిక సందర్భంగా తెలుగుదేశం తమ్ముళ్ళు భక్తుల సేవలో సలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఆడికృత్తిక సందర్భంగా తెలుగుదేశం తమ్ముళ్ళు ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు బొజ్జల బృందమ్మ, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలతో పాటు, మజ్జిగ,లస్సీ అందించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి తెలుగుదేశం కార్యదర్శి కాసరం రమేష్,బోర్డు సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, బాలు డిల్లిబాలు, కంఠా సుబ్బు, కోలా రాకేస్, బాబునాయుడు, నాగరాజు, నవీన్, బి.రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

## జనసేన నాయకులచే గోశాల పరిశీలన



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మంలంలోని వాగవేడులో రామకృష్ణ శర్మచే నిర్వహిస్తున్న గోశాలను గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు దండి రాఘవయ్య, జనసేన పార్టీ నాయకుడు దండి నరేంద్రలు పరిశీలించారు. గోమాత సేవే మహోన్నత మానవ సేవగా భావించి గ్రామానికి చెందిన రామకృష్ణశర, ఉమాదేవి,కార్తీక్‌లు స్వయంగా నిర్వహించటం అభినందనీయం అన్నారు.

## ఆగిన అంగన్‌వాడి భవనం పూర్తి చేయాలి : ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి రూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. గ్రామీణాభివృద్ధికి పుష్కలంగా నిధులుమంజూరు చేస్తున్నాము. అయితే ముచ్చివోలు దళితవాడలో అర్థాంతరంగా ఆగిన అంగన్ వాడి భవనాన్ని చూసిన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి స్పందించారు. వెంటనే అక్కడ నుంచి వీడియో కాల్‌లో జిల్లా కలెక్టర్‌తో సమీక్షించారు. గురువారం ఆయన ముచ్చివోలు దళిత వాడలో ఇంటి ఇంటికి మీ సుధీరన్న కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం రూపొందించిన 45రోజుల కార్యక్రమంలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి విస్తృతంగా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి మండలంలో పర్యటిస్తున్న శాసనసభ్యుడు సమస్యలపై స్పందిస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా ఎందుకు ఇంకా సమస్యలు తిష్ట వేస్తున్నాయని ప్రశ్నిస్తున్నారు. త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యక్ష ఎన్నికలకు నిర్ణయించినందువల్ల పార్టీ నాయకులు ప్రజలతో మమేకం కావాలని సూచిస్తున్నారు. ఈ సందర్భంగా ముచ్చివోలు పంచాయతీకి రూ.14.83 కోట్లు అభివృద్ధికి వినియోగించామన్నారు. ఈ పర్యటనలో ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డితో పాటు మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు అక్షింత కృష్ణయాదవ్, కృష్ణమనాయుడు,రమేష్‌నాయుడు,మల్లికార్జున్,పవన్,మురళీకృష్ణరెడ్డి, నరసయ్య, నారాయణ, వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్టుచే ప్రసాదాల వితరణ




శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని కుమారస్వామి కొండపై జరుగుతున్న ఆడికృత్తిక మహోత్సవాల్లో భాగంగా గురువారం ఆడికృత్తిక సందర్భంగా పలువురు,స్వచ్ఛంద సేవా సంస్థలు తమ వంతు సహాయంగా భక్తులకు ప్రసాదాలు వితరణ గావించారు. సుబ్రమణేశ్వర ట్రస్టు సారధ్యంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రసాదాల వితరణ కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధులుగా బొజ్జల బృందమ్మ, ఆలయ ఇఓ బికె వెంకటేశులు, శ్రీకాళహస్తీశ్వరా లయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్‌ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ ట్రస్టు ప్రతిఏడాది ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు ప్రసాదాలు ఇవ్వటం వారి ధార్మికతకు నిదర్శనం అన్నారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తమ వంతు సహకారం అందించాలన్నారు.

## రాయలసీమ జిల్లా అధికారులకు శిక్షణ



శ్రీకాళహస్తి ఆగస్టు 6 ప్రభాతవార్త: స్వర్ణ ఆంధ్ర 2047, లక్ష్య సాధనకు పంచాయతీ అభివృద్ధి అధికారులు నడుం బిగించాలని గురువారం జరిగిన సీమలోని 8 జిల్లాల అధికారుల సమావేశంలో ఉన్నతాధికారులు పిలుపు నిచ్చారు. అధికారులు రాయలసీమలోని 8 జిల్లాల నుంచి వచ్చిన 135 మంది అధికారులకు శ్రీకాళ హస్తి మండలం రాచగున్నేరి గ్రామ పంచాయతీలో క్షేత్ర స్థాయి శిక్షణ నిర్వహించారు. తాగునీటి సంరక్షణ, లేఅవుట్లు, భవన అనుమతులు అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. నిర్వహణ, చెత్తసేకరణ, డిజిటల్ అనుమతుల ప్రక్రియ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెంచల శ్యామ్, డిప్యూటీ ఎంపీడీఓ పద్మజ, మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పంతుళ్ళపై పగబట్టిన వైసిపి



శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త: ఏళ్ల తరబడి పడ్డ కష్టానికి తగిన ఫలితం దక్కి, జీవితంలో స్థిరపడ్డామని సంతోషంగా విధులకు వెళ్తున్న పంతుళ్ళపై పగబట్టి వైసిపి మానసిక అరాచకానికి పాల్పడుతోందని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఆరోపించారు. కల్పిత కథనాలతో, అభూత కల్పనలతో అసత్య ప్రచారం చేయడం ద్వారా ఏర్పడే గందరగోళంతో తనకు వ్యతిరేకంగా ఓటు వేసిన యువతరాన్ని ఇబ్బంది పెట్టాలనే జగన్ రెడ్డి, తన సైకో బృందాల చేత దొంగ దీక్షలు చేయిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, డా.యం.ఉమేష్ రావు,బీమాల భాస్కర్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, చిల్లకూరు మణి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరతను నివారించండి



శ్రీకాళహస్తి ఆగస్టు 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణం నందు గల వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్‌రెడ్డికి శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరంరెడ్డి ఆధ్వర్యంలో యూరియా కొరత నివారించాలని వినతి పత్రం అందజేయడం జరిగినది. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ నందు రైతులు యూరియా కొరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు వెంటనే రైతుల ఇబ్బందులు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సీతారాం, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, నాగరాజు, షాన్ మైఖేల్,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు మయూరంపై...షణ్ముఖుని దివ్యదర్శనం



శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆడికృత్తికను పురస్కరించుకుని గురువారం రాత్రి కుమారస్వామి మయూర వాహనంపై పురప్రజలకు దర్శనమిచ్చారు. వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి ఉత్సవమూర్తులను సర్వాంగసుందరంగా ముస్తాబుచేసి బోయిలు మోసుకుంటూ తీసుకువచ్చి ఆలయం వెలుపల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మయూర వాహనంపై ఆశీనుల్ని చేసి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. హారతులిచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ పర్యవేక్షించారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**-గాలి మురళి నాయుడు**



తొట్టంబేడు, ఆగస్టు 6 ప్రభాతవార్త: రైతుల ఆదాయాన్ని పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని దానిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళినాయుడు గురువారం పిలుపునిచ్చారు. తొట్టంబేడు మండలం ఇలగనూరు సచివాలయంలో రైతులకు 50 శాతం సబ్సిడీతో జీలగలు, పిల్లి పెసర్లు పంపిణీ చేశామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు అందజేయడం ద్వారా రైతులపై పడుతున్న పెట్టుబడి భారాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం అని,ప్రస్తుతం రైతులకు అన్ని రకాల సహాయాలు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అగ్రికల్చర్ అధికారి పవన్, పవిత్ర, ఇనయతుల్లా, మాజీ సర్పంచ్ మధు నాయుడు, మహిళా నాయకురాలు గీత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై సబ్సిడీ విత్తనాలను తీసుకున్నారు.

## పొయ్యలో రీసర్వే ప్రారంభం




తొట్టంబేడు, ఆగస్టు 6 ప్రభాతవార్త: భూ వివాదాలకు చెక్ పెట్టి, రైతులకు స్పష్టమైన భూ రికార్డులు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన రీసర్వే ప్రాజెక్టు తొట్టంబేడు మండలం పొయ్య గ్రామంలో గురువారం ప్రారంభమైందని తహసీల్దార్ భారతి అన్నారు. ఇందులో భాగంగా గురువారం రైతుల సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. పొయ్య రెవిన్యూ పరిధిలో ఉన్న పొయ్య, పొయ్య కొత్తూరు, లింగమనాయుడు పల్లి, కురవకనేరి, క్రైస్తవమిట్ట, దొమ్మరిమిట్ట అనే 6 గ్రామాల్లో రీసర్వే చేపట్టనున్నారు. ఈ గ్రామాల్లో మొత్తం సర్వే నెంబర్లు 1 నుంచి 319 వరకు ఉన్నాయి. వీటి మొత్తం విస్తీర్ణం 1742.06 ఎకరాలుఅని డిప్యూటీ తహసీల్దార్ జీవన్ కుమార్ తెలిపారు. సభలో డిప్యూటీ తహసీల్దార్ జీవన్ కుమార్ మాట్లాడుతూ, ఇప్పటికే అర్హులైన రైతులకు నోటీసులు పంపామని చెప్పారు. సోమవారం నుంచి నోటీసులు అందుకున్న రైతుల పొలాలను దశలవారీగా సర్వే చేస్తామని వివరించారు. మండల సర్వేయర్ హరినాథ్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్లు, జిపిఎస్ ద్వారా కొలతలు తీస్తామని, దీనివల్ల భూమి విస్తీర్ణంలో ఎలాంటి తేడాలు ఉండవని స్పష్టం చేశారు. ఈ గ్రామసభలో డిప్యూటీ తహసీల్దార్ జీవన్ కుమార్, మండల సర్వేయర్ హరినాథ్, మండల ఎంపీపీ భర్త ఉన్నం వాసుదేవ నాయుడు,ఉన్నం ప్రసాద్, వీఆర్వో మువర్ణ, సచివాలయ సర్వేయర్ ఉదయ్, వీఆర్ఏ లు.. పలువురు రైతులు పాల్గొన్నారు.

# పొదుపుతోపాటు దాతృత్వం..



పిల్లలకిచ్చే మొత్తం పాకెట్ మనీని సొంతంగా ఖర్చు పెట్టుకుంటున్నారా. అయితే ఈ కిడ్డీబ్యాంకులు కొనివ్వండి. ఇవైతే పొదుపుతోపాటు నలుగురికీ సాయపడటాన్నీ నేరిస్తాయి. బాల్యం నుంచే పొదుపు చేయడం నేర్పిస్తే భవిష్యత్తులో వారికి ఆర్థిక ప్రణాళిక అలవడుతుంది. చేతిలో ఉన్నదంతా ఖర్చు పెట్టకుండా, కొంతైనా పొదుపు చేయడంవల్ల అత్యవసరానికి ఉపయోగపడుతుందని అర్థమవుతుంది. అలాగే తమవద్ద ఉన్నదాంట్లో కొంతైనా పేద పిల్లలకు, అనాథలకు అందించడం చిన్నప్పటి నుంచి పిల్లలకు అలవాటు చేస్తే వాళ్లలో దయాగుణం పెరుగుతుంది. ఈ లక్షణాలు పిల్లలకు రావాలంటే ప్రత్యేకంగా వస్తున్న ఈ కిడ్డీ బ్యాంకులను అందించండి. వీటిని రకరకాల రంగుల్లో జంతువుల ఆకారాల్లో పిల్లలను ఆకర్షించేలా తయారుచేస్తున్నారు. వీటిలో విడివిడిగా ఉన్న అరలపై పొదుపు, దానం, ఖర్చు అంటూ ప్రింట్ చేసి ఉంటుంది. వీటన్నింటిలోనూ తమ వద్ద ఉన్న నగదును సమానంగా వేయడం నేర్పితే చాలు. చిన్నారులకు క్రమేపీ ఇదొక అలవాటుగా మారుతుంది.

**ఖాళీ సీసాలతో..** ఇంట్లోనే... మార్కెట్‌లో దొరుకుతున్నవే కొనాలనేం లేదు. వీటిని ఇంట్లోనూ తయారుచేసి పిల్లలకు అందించొచ్చు. ఒకే ఆకారం, పరిమాణంలో ఉన్న మూడు ఖాళీ సీసాలు తీసుకొని సేవింగ్స్, టాయ్స్, డొనేషన్ అని రాసి వాటికి అంటించాలి. హోం మేడ్ కిడ్డీ బ్యాంకులు సిద్ధమవుతాయి. ఖాళీ పౌడర్, కూల్‌డ్రింక్ డబ్బాలకు స్టిక్కర్లు అంటించినా చాలు. వీటిని పిల్లలతోనూ సరదాగా సెలవురోజుల్లో తయారు చేయించొచ్చు. మరింకెందుకు ఆలస్యం? మీ బుజ్జాయిలకూ పొదుపు అలవాటు చేయండి. □

# జుట్టుకి ముల్తానీ మాస్క్!

**తక్కువ ఖర్చుతో** తొందరగా తాజా మెరుపుని పొందాలంటే మనందరి మొదటి ఎంపిక ముల్తానీ మట్టే. దీన్ని ఎక్కువగా ముఖానికి మాస్క్ వేసుకునేందుకు వాడతారనే తెలుసు. కానీ ఇది జుట్టుకీ బోలెడన్ని ప్రయోజనాలు ఇస్తుందట.



ముల్తానీ మట్టి జుట్టుకి ఉన్న మురికినీ, చుండ్రునీ వదలిస్తుంది. మాడుపై అదనంగా విడుదలయ్యే నూనెల్ని నియంత్రిస్తుంది. కండిషనర్‌గా పనిచేసి కురులను మృదువుగా, మెరిసేలా చేస్తుంది. ఇందుకు ముల్తానీ మట్టి, బియ్యప్పిండి సమాన భాగాలుగా తీసుకుని కప్పు పెరుగు, ఓ గుడ్డులోని తెల్లసొన కలిపి మెత్తని పేస్టులా చేయాలి. దీన్ని మాడు నుంచి చివర్లకు పట్టించాలి. అరగంటాగి గాఢత లేని షాంపూతో తలస్నానం చేస్తే సరి. నాలుగుచెంచాల మల్తానీ మట్టికి రెండుచెంచాల నిమ్మరసం, చెంచా పెరుగు చేర్చి పేస్ట్‌లా చేయాలి. దీన్ని కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. అరగంటాగి రసాయనాలు లేని షాంపూతో తలస్నానం చేస్తే సరి. కురులు నిగనిగలాడతాయి. ఇందులోని యాంటీబ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబయాల్ లక్షణాలు చుండ్రుని తగ్గిస్తాయి. □

# చినుకుల్లో మెరుపులీనుతూ..



**సీజన్ ఏదైనా..** ముఖం అందంగా మెరవాలనుకుంటాం. అయితే ఈ వర్షాకాలంలో తడిసినప్పుడు మేకప్ కరుగుతుంది. ముఖమంతా ప్యాచ్‌లుగా కనిపించడంతో ఇబ్బందిగా అనిపిస్తుంది. అలాకాకుండా ఉండాలంటే మేకప్‌లో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలు. చర్మాన్ని ఈ సీజన్‌లో పొడారనివ్వకుండా జాగ్రత్తపడాలి. వాతావరణం చల్లగా ఉందంటూ నీటిని తీసుకోకుండా ఉండకూడదు. శరీరానికి కావాల్సినంత నీటిని అందించాలి. అప్పుడే చర్మం ఆరోగ్యంగా తేమగా ఉంటుంది. ఇక మాయిశ్చరైజర్ విషయానికొస్తే మిగతా కాలాల్లో వాడే దానికి ప్రాధాన్యం ఇవ్వకూడదు. ఇది ముఖాన్ని జిడ్డుగా మారుస్తుంది. ఆ తరవాత ముఖంపై వేసే మేకప్‌నూ ప్రభావితం చేస్తుంది. బదులుగా నాణ్యమైన, నీటి ఆధారిత మాయిశ్చరైజర్‌ను ఎంచుకుంటే సరి. ఇది మేకప్‌కు మంచి బేస్ అవుతుంది. చినుకులు పడినప్పుడు కూడా ముఖంపై ప్యాచెస్‌లా కనిపించనివ్వదు. మస్కారా కూడా వాటర్‌ప్రూఫ్ అయితేనే మేలు. కళ్లకు పెట్టిన వెంటనే త్వరగా ఆరుతుంది. తడికి కరగకుండానూ ఉంటుంది. మేకప్ తీసేయాలనుకున్నప్పుడు గులాబీనీళ్ల లోనో కొబ్బరినూనెలోనో ముంచిన దూదితో తేలికగా శుభ్రం చేయొచ్చు.

**పౌడర్ ఆధారితంగా...** ముఖ చర్మం మృదువుగా మెరిసేలా కనిపించడానికి ముందుగా వేసే ప్రైమర్ విషయంలో మ్యాట్ ఫినిష్ ఇచ్చేదాన్ని ఎంచుకోవాలి. మేకప్ చెరిగిపోకుండా ఇది నిలపగలుగుతుంది. అలాగే మేకప్‌లో క్రీమ్స్ వినియోగంకన్నా పౌడర్ వాడితే మంచిది. ఈ సీజన్‌లో లైట్ వెయిట్ లిక్విడ్ ఫౌండేషన్‌లో ముందుగా కొంచెం వదులుగా ఉండే పౌడర్ కలుపుకోవాలి. మందపాటి ఫౌండేషన్ బ్రష్‌తో తేలికపాటిలేయర్స్‌గా అప్లై చేయాలి. ఈ విధానంలో ముఖం తడిసినా ప్యాచెస్‌లా కనిపించదు.

**తక్కువగా....** లిప్‌స్టిక్ గ్లాసీగా కనిపించేది కాకుండా మ్యాట్ లుక్ ఇచ్చేది తీసుకోవాలి. అనుకోకుండా చినుకుల్లో తడిసినప్పుడు ఇది చెరగకుండా, పెదవులకు న్యూట్రల్ టింట్ ఇస్తుంది. ఎక్కువ సమయ తాజాగా కనిపించేలానూ చేస్తుంది. అంతేకాదు, వర్షాకాలంలో ఎంత తక్కువ మేకప్ వేస్తే అంత మంచిది. చెక్కిళ్లు, గడ్డం, ముక్కు చివర, కనుబొమల మధ్య మాత్రం వాటర్‌ప్రూఫ్ కన్సీలర్‌ను బ్రష్‌తో కాస్తంత హైలైట్ చేయగలిగితే చాలు. చివరగా మేకప్ సెట్టింగ్ స్ప్రే తప్పనిసరి. ఇది మేకప్ కరగకుండా కాపాడుతుంది. చినుకుల్లోనూ మెరిసే మోము సొంతమవుతుంది. □

# లక్ష్మీదేవి అనుగ్రహం

అన్ని సమస్యల్లోకి ఆర్థికపరమైన సమస్య పెద్దదిగా కనిపిస్తుంది. మానసికంగాను .. శారీరకంగాను కుంగదీస్తుంది. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు నిస్సహాయుడిని చేసి వేదనకి గురిచేస్తుంది. అందువలన ప్రతి ఒక్కరూ కూడా ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురు కాకుండా చూడమనే దైవాన్ని వేడుకుంటారు. ఆర్థికపరమైన ఇబ్బందులు దరిచేరకుండా



ఉండాలంటే లక్ష్మీదేవి అనుగ్రహం వుండాలని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. లక్ష్మీదేవి ప్రీతి చెందితే ఆ తల్లి అనుగ్రహం లభిస్తుంది. అలా లక్ష్మీదేవి అనుగ్రహం లభించేలా చేసేదిగా 'ఆశ్వయుజ పౌర్ణమి' కనిపిస్తుంది. ఈ రోజున లక్ష్మీదేవికి ఎంతో ప్రీతికరమైన 'కోజాగరీ వ్రతం' ఆచరించాలనేది మహర్షుల మాట. ఈ రోజున ఈ వ్రతాన్ని ఆచరించి .. మిగిలిన సమయ మంతా కూడా భక్తి శ్రద్ధలతో అమ్మవారిని స్మరిస్తూ .. సేవిస్తూ ఉండాలి. ఆ తల్లిని కీర్తిస్తూనే జాగరణ చేయాలి. ఈ రోజున రాత్రివేళలో ఆకాశ మార్గాన ప్రయాణించే అమ్మవారు, జాగరణ చేసేవారిని అనుగ్రహిస్తుందని చెబుతారు. అందువలన లక్ష్మీదేవి అనుగ్రహాన్ని

# పూల రబ్బరు బ్యాండు !



పూలంటే ఇష్టపడని మగువలుంటారా చెప్పండి! కానీ, తీరిక లేకో, కార్పొరేట్ వస్త్రధారణకు నప్పకో పూలు పెట్టుకోవడం తగ్గించేశారు చాలామంది యువత. కానీ, సంప్రదాయంగా చీరకట్టో, లంగా ఓణీ ధరించాక పూలు పెట్టకుండా జుట్టుని వదిలేస్తే ఎబ్బెట్టుగా ఉండదూ! అలాంటి సందర్భాలలో చక్కగా జడ అల్లి ఓ చిన్న పువ్వు అయినా తలలో తురిమి.. మరిసిపోయిన అమ్మ గుర్తొచ్చేస్తుంది. అలాగని మనమే కొనుక్కుందామంటే పొద్దున్నే అంత తీరికెక్కడిది? పైగా ప్రయాణాలు, మీటింగ్‌లూ.. ఇలా మనం తిరిగే హడావుడికి ఇట్టే వాడిపోతాయి. ఇక, మీకా బెంగ అక్కర్లేదు. ఇలాంటి వారికోసమే రబ్బరు బ్యాండ్ల రూపంలో ఆర్టిఫిషియల్ పూల మాలలు వచ్చేశాయి. జడ అల్లుకున్నా, పోనీ వేసుకున్నా, కొప్పు పెట్టుకున్నా.. దీంతో బిగించేయండి రాలిపోతాయనో, వాడిపోతాయనో భయమూ అక్కర్లేదు. చాలా బాగుంది □

# బిసిబేళ పులిబాత్

**కావలసిన పదార్థాలు:** ఓట్స్: రెండు కప్పులు, కందిపప్పు: ఒక కప్పు ఉల్లిగడ్డలు: రెండు , క్యారెట్లు: రెండుఆలుగడ్డలు: రెండు , బీన్స్: గుప్పెడు నూనె: టేబుల్ స్పూన్, జీలకర్ర: అర స్పూను ఆవాలు: స్పూను ,దాల్చిన చెక్క: చిన్న ముక్క సాంబార్ పొడి: ఒక స్పూను చింతపండు: నిమ్మకాయ సైజులోకరివేపాకు:



రెండు రెబ్బల ఉప్పు: తగినంత

**తయారీ :** ముందుగా ఉల్లిపాయలు సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. తర్వాత ఆలుగడ్డలు, క్యారెట్, బీన్స్‌లను శుభ్రంగా కడిగి అంగుళం ముక్కలుగా కట్ చేసి ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ఓట్స్, కందిపప్పులను విడివిడిగా ఉడికించుకోవాలి. చింతపండు కడిగి రసం తీసి పెట్టుకోవాలి. పొయ్యి మీద బాణలి పెట్టి నూనె వేసి జీలకర్ర, ఆవాలు, దాల్చిన చెక్క వేసి వేయించుకోవాలి. అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయలను కూడా వేయాలి. కాస్త వేగాక ఇందాక ఉడికించుకున్న ముక్కలను కలపాలి. ఇందులోనే ఉడికించిన పప్పు, ఓట్స్‌లను కూడా వేయాలి. ముందుగా తీసి పెట్టుకున్న చింతపండు రసం, తగినంత ఉప్పు, సాంబార్ పొడి, కరివేపాకులను కూడా జోడించాలి. అన్నింటినీ బాగా కలిపి బాణలి మీద మూత పెట్టి ఈ మొత్తం మిశ్రమాన్ని బాగా ఉడికించుకుంటే బిసిబేళ పులి బాత్ రెడీ! □

# 'అనకాపల్లి' ప్రి రిలీజ్ ఈవెంట్‌లో సోనూసూద్



అనకాపల్లి చిత్రం యువత తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది.. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో లగడపాటి శ్రీధర్.. భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కాంద్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మించిన రా అండ్ రస్టిక్ చిత్రం అనకాపల్లి. ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. కాంద్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీకి కథ, స్క్రీన్ ప్లేని అందించడమే కాకుండా త్రినాథరావు నక్కిన ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. సోనూ సూద్ మాట్లాడుతూ.. .. అనకాపల్లి సినిమా ఈవెంట్ కోసం ఇక్కడకు రావడం ఆనందంగా ఉంది. విక్రమ్, తారక్, సంధ్య అద్భుతంగా నటించినట్టు కనిపిస్తోంది. ఖగేష్ ఈ చిత్రాన్ని గొప్పగా తీసినట్టు అనిపిస్తోంది. అనకాపల్లి సినిమాని అనకాపల్లి ప్రజలు సపోర్ట్ చేయాలి...లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. .. అనకాపల్లి ఈవెంట్‌కు వచ్చిన సోనూ సూద్ గారికి థాంక్స్. ఆయన ఎంతో మందికి దేవుడు. నేను ఈ మూవీని ఆల్రెడీ చూశాను. అద్భుతంగా వచ్చింది. అనకాపల్లిలోనే ప్రేక్షకులతో పాటుగా మళ్లీ సినిమాని చూస్తాను. విక్రమ్ సహిదేవ్ మాట్లాడుతూ.. .. అనకాపల్లి కోసం వచ్చిన సోనూ సూద్ కి థాంక్స్. ఖగేష్ మా అందరి కంటే ఎక్కువగా కష్టపడ్డాడు. అతను పడిన కష్టానికి తగిన ప్రతిఫలం రావాలని కోరుకుంటున్నాను.

తార

## 'చెన్నై లవ్ స్టోరీ' రూ. 50 కోట్ల గ్రాసర్‌గా నిలిచింది



స్టోరీ రైటర్, ప్రొడ్యూసర్ సాయి రాజేష్‌కొబ్బరిమట్ట, హృదయకాలేయం, కలర్ ఫొటో, బేబి వంటి చిత్రాలతో స్టోరీ రైటర్‌గా, డైరెక్టర్‌గా, ప్రొడ్యూసర్ గా తనకంటూ ఓ ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు సాయి రాజేష్. ఆయన కథను అందించి ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ తో కలిసి నిర్మించిన తాజా చిత్రం "చెన్నై లవ్ స్టోరీ" ప్రేక్షకాదరణతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద 50 కోట్ల రూపాయల వసూళ్లను దాటి రెండో వారంలోనూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో "చెన్నై లవ్ స్టోరీ" సినిమా విజయం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు సాయి రాజేష్. హృదయ కాలేయం , కొబ్బరిమట్ట సినిమాల సమయంలో డైరెక్టర్ గా నా పేరు స్టీవెన్ శంకర్ అని పెట్టుకున్నా. స్టీవెన్ స్పీల్ బర్గ్ లోని స్టీవెన్, శంకర్ లోని శంకర్ తీసుకున్నదే స్టీవెన్ శంకర్. దర్శకుడిగా ప్రచార కార్యక్రమాల్లో నేను బయటకు వచ్చి మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉండేది. అమ్మా నాన్నలు పెట్టుకున్న పేరుతోనే మన కెరీర్ కొనసాగించాలి అని అనుకుని కలర్ ఫొటో టైమ్‌లో సాయి రాజేష్‌గా క్రెడిట్స్ లో పేరు వేసుకున్నాను. ప్రేక్షకులు స్టీవెన్ శంకర్ అనే పేరును మర్చిపోయారా అనుకునే టైమ్‌లో మా చెన్నై లవ్ స్టోరీ సినిమాలో హీరో కిరణ్ క్యారెక్టర్ కు స్టీవెన్ శంకర్ అని పెట్టుకోవడం కలిసొచ్చింది. దీంతో ఇంకొంతకాలం ప్రేక్షకులు స్టీవెన్ శంకర్ పేరు గుర్తుపెట్టుకుంటారు. చెన్నై లవ్ స్టోరీ సినిమాకు నేను దర్శకత్వం వహించాలనే ఉద్దేశం లేదు. ఎందుకంటే నేను డైరెక్టర్‌గా బేబి సినిమా హిందీ రీమేక్ వర్క్స్‌లో ఉన్నాను. దాదాపు రెండేళ్లు ఒక సినిమాకు కష్టపడతాను కాబట్టి ఏదైనా రిజల్ట్ తేడాగావస్తే వెంటనే తీసుకోలేను.

## 'కొరియన్ కనకరాజు' ప్రేక్షకులందరినీ అలరిస్తుంది: వరుణ్ తేజ్



**కొరియన్ కనకరాజు కథ విన్నప్పుడు మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలు ఏమిటి?**

ముఖ్యంగా ఇందులో ఉన్న ఎంటర్‌టైన్‌మెంట్ నాకు చాలా నచ్చింది. గాంధీ ఈ కథ చెప్పినప్పటి నుంచి నేను నవ్వుతూనే ఉన్నాను. నేను ఏ కథ విన్నా, థియేటర్‌లో కూర్చొని సినిమా చూస్తున్న ప్రేక్షకుడిలాగే వింటాను.

**మీ కటౌట్‌కి సరిపోయే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయనిపిస్తోంది కదా?**

నిజానికి ఒక నటుడు అన్ని రకాల పాత్రలు చేయాలి. నేను అన్ని రకాల పాత్రలు చేస్తాను. పొడవుగా ఉండే హీరోలు కామెడీ చేయకూడదనే ఒక అభిప్రాయం ఉంది. అది సరైనది కాదు. పాత్రను సరిగ్గా రాస్తే కామెడీ కుదురుతుంది.

**ప్రమోషన్స్ కూడా చాలా కొత్తగా చేశారు కదా?** అవునండి. ఈ రోజుల్లో సినిమాను జనాల్లోకి తీసుకెళ్లాలంటే ప్రమోషన్స్ కూడా కొత్తగా ఉండాలి. అంతేకాదు, అవి సినిమా కంటెంట్‌కు కనెక్ట్ అయ్యేలా ఉండాలి.

**సత్యతో మీ కాంబినేషన్ గురించి?**

సత్యతో నాకు చాలా మంచి బాండింగ్ ఉంది. మా ఇద్దరం కలిసి చేస్తున్న మూడో సినిమా ఇది. సత్యను కేవలం కమెడియన్‌గా మాత్రమే చూడకూడదు. తనలో మంచి నటుడు కూడా ఉన్నాడు.

**కొరియన్ భాష నేర్చుకోవడం ఎలా అనిపించింది?**

నాకు కొత్త విషయాలు నేర్చుకోవడం చాలా ఇష్టం. అందుకే నటుడిని అయ్యాను.

**రెండు విభిన్న పాత్రలు చేయడం ఎలా అనిపించింది?**

ఒక నటుడిగా ఇది నాకు చాలా ఛాలెంజింగ్ రోల్. రెండు విభిన్నమైన బాడీ లాంగ్వేజ్‌లు, రెండు భిన్నమైన మనస్తత్వాలు చూపించే అవకాశం రావడం చాలా సంతోషంగా అనిపించింది. నటుడిగా చాలా తృప్తిని ఇచ్చింది.

**మీకు ఫేవరెట్ జానర్ ఏది?**

హ్యూమర్, యాక్షన్ సినిమాలు చూడడం చాలా ఇష్టం.

**ట్రైలర్‌కు ఓజీతో పోలికలు వచ్చాయి కదా?**

కళ్యాణ్ బాబాయ్ ఫ్యాన్స్ కి చాలా ఇంపాక్ట్ క్రియేట్ చేసిన సినిమా ఓజీ. అందులో జపనీస్ టచ్ ఉంది. అందుకే కొంతమందికి అలాంటి పోలిక అనిపించి ఉండొచ్చు.

**కొరియన్ గెటప్ కోసం ఎలాంటి హోమ్‌వర్క్ చేశారు?**

క్యారెక్టర్ డిజైన్ విషయంలో చాలా ప్లాన్ చేశాం. హెయిర్‌స్టైల్ పూర్తిగా కొరియన్ లుక్‌లో ఉండాలని నిర్ణయించుకున్నాం. కొరియన్లకు స్ట్రైట్, సిల్కీ హెయిర్ ఉంటుంది.

## 'సర్దార్ సర్వాయి పాపన్న' సినిమా పోస్టర్ లాంచ్



డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా వచ్చే వారం గ్రాండ్ థియేట్రికల్ కు రాబోతున్న యానివే ఎషన్ మూవీ బహుజన చక్రవర్తిగా కీర్తి పొందిన చారిత్రక వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి రూపొందించిన యానిమేషన్ మూవీ "సర్దార్ సర్వాయి పాపన్న". ఈ సినిమాను వి.జి. మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. దీపక్ న్యాతి నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు వహిస్తున్నారు. ఈ యానిమేషన్ మూవీ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా వచ్చేవారం గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్ర పోస్టర్ లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఈ రోజు "సర్దార్ సర్వాయి పాపన్న" సినిమా పోస్టర్ లాంఛ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. దాదాపు 360 ఏళ్ల క్రితం బహుజన చక్రవర్తిగా వెలుగొందిన సర్దార్ సర్వాయి పాపన్న జీవిత కథతో వెంకటేష్ గౌడ్ దర్శక నిర్మాతగా ఈ చిత్రాన్ని రూపొందించారు. మా ఆర్కే ఫిలింస్ ద్వారా వచ్చే వారం ఈ సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఈ సినిమాను నేను చూశాను. మా వెంకటేష్ అద్భుతంగా రూపొందించాడు. సర్దార్ పాపన్న గొప్పతనం ఎక్కడా తగ్గించకుండా, ఆయన ఎన్ని పోరాటాలు చేశాడు, దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి మాట్లాడుతూ మా వి.జి. మూవీ మేకర్స్ బ్యానర్ పై "సర్దార్ సర్వాయి పాపన్న" సినిమాను నిర్మించాం. మాకున్న వనరులకు ఇది భారీ బడ్జెట్ మూవీ అనే చెప్పాలి. అయినా సినిమా కంప్లీట్ చేసి సెన్సార్ పూర్తి చేసి రిలీజ్ కు తీసుకొస్తున్నాం. . ఈ నెల 14, లేదా 21న రిలీజ్ అనేది ప్లాన్ చేస్తున్నాం. సర్దార్ పాపన్న 376వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మా "సర్దార్ సర్వాయి పాపన్న" సినిమాను రిలీజ్ చేయాలని భావిస్తున్నాం.

## 'బంగారం' సాంగ్ లాంచ్



సోషల్ మీడియాలో వైరల్ మారిన డెమాన్ పవన్, రీతూ చౌదరి 'బంగారం' సాంగ్ బిగ్‌బాస్ ఫేమ్ డెమాన్ పవన్, రీతూ చౌదరి జంటగా నటించిన 'బంగారం' ఆల్బమ్ సాంగ్ విడుదలై సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. మెలోడీ, విజువల్స్, ఇద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుండటంతో ఈ పాట ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. ఈ పాటకు అఫ్రోజ్ అలీ సాహిత్యం అందించడంతో పాటు స్వరపరిచి, స్వయంగా ఆలపించారు. సమీరా భరద్వాజ్ వోకల్స్ పాటకు మరింత అందం తీసుకొచ్చారు. ముఖ్యంగా రఞ్జిత్ రెడ్డి అందించిన మ్యూజిక్ ఈ పాటకు పెద్ద ప్లస్‌గా నిలిచింది. సాంగ్ లాంచ్ ఈవెంట్ లో డెమన్ పవన్ మాట్లాడుతూ: బిగ్‌బాస్ ద్వారా నాకు ఎంతో ప్రేమ, ఆదరణ లభించింది. ఆ ప్రేమతోనే ఈ పాటను నిర్మించాను. ఇదంతా మీ అందరి సపోర్ట్ వల్లే సాధ్యమైంది. ఈ వేడుకకు వచ్చిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మా లిరిసిస్ట్, కంపోజర్ అఫ్రోజ్ అలీకి, సింగర్ సమీరా భరద్వాజ్‌కి థ్యాంక్యూ. చాలా బ్యూటిఫుల్ సాంగ్ ఇచ్చారు. రీతూ చౌదరి మాట్లాడుతూ: ఈ సాంగ్‌కు ఇంత మంచి రెస్పాన్స్ ఇచ్చిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ పాటలో భాగం కావడం నాకు చాలా ఆనందంగా ఉంది. ముఖ్యంగా డెమన్ పవన్ కోసం ఈ సాంగ్ చేశాను. పవన్ ఎంతో ప్యాషన్‌తో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. షూటింగ్ మొత్తం చాలా సరదాగా జరిగింది. సమీరా భరద్వాజ్ మాట్లాడుతూ: పవన్, రీతూ కలిసి చాలా మంచి పాట చేశారు. ఇది నిజంగా బ్యూటిఫుల్ సాంగ్. ఈ పాట మీద నమ్మకంతో వాళ్లు నిర్మించారు. లిరిసిస్ట్, కంపోజర్, సింగర్ అఫ్రోజ్ అలీ మాట్లాడుతూ: ఈ పాట మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. చాలా క్రేజీగా ఈ పాటను రాశాను.

## 'హుషార్ పిట్టలు' అందరి హృదయాలకు హత్తుకుంటుంది: బెక్కెం వేణుగోపాల్



అన్ను, వాసవి గణేషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్ టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ మా సినిమా ఆగస్టు 15న విడుదల చేస్తున్నాం కానీ. బుక్ మై షోలో ఇప్పటి నుంచే టిక్కెట్స్ సేల్ చేస్తున్నాం. బుక్‌మై షో బుకింగ్ యాప్‌లో నా ఫోటో చూసుకోవాలని ఎప్పటి నుంచో కలలు కన్నాను. ఈ రోజు ఇది నెరవేరింది. ఈ సినిమా చూసి అందరూ మరొకరికి రికమెండ్ చేస్తారు. దర్శకుడు కావాలన్న నా డ్రీమ్ నెరవేరింది. ఈ సినిమా ట్రైలర్ ఈ నెల 10న విడుదల చేస్తున్నాం. ట్రైలర్ చూసిన తరువాత సినిమా మీద అందరి ఒపినియన్ మారిపోతుంది. బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ సినిమా నచ్చి సపోర్ట్ చేస్తున్నాను. తప్పకుండా ఈ సినిమా హిట్ కాబోతుందనే ఆత్మవిశ్వాసం అందరిలో కనిపిస్తుంది. సినిమా చూడగానే నాకు కూడా ఈ సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం కలిగింది. నిర్మాత సురేష్ బాబు చూసి నచ్చి ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. చాలా పెద్ద సినిమాల మధ్యలో వస్తుంది. సినిమా మీద నమ్మకంతోనే విడుదల చేస్తున్నారు. ఈ సినిమా పతాక సన్నివేశాలు అందరి హృదయాలను హత్తుకుంటాయి. అన్ని వర్గాలకు నచ్చే సినిమా ఇది.